క్లుప్తంగా

రోడ్డు మరమ్మతులు


రోడ్డును చదును చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి జంగారెడ్డిపల్లి నుంచి పోలెపల్లి గేటు వరకు ఉన్న రోడ్డు వర్షాలకు గుంతలమయంగా మారింది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు విక్రంరెడ్డి సొంత ఖర్చుతో రోడ్డును చదును చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు జగ్‌రాంనాయక్, తరుణ్‌రెడ్డి, శ్రీధర్, కృష్ణానాయక్, చంద్రు, కిరణ్, నర్సింహా, శ్రీను, రవీందర్, శేఖర్, శివ, భాస్కర్ పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులతో భద్రం

ఏసీపీ కేపీవీ రాజు


మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: కొత్త వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధి పిల్లిపల్లి గ్రామంలో బుధవారం ప్రజలతో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు, ప్రాజెక్టులు, కొత్త సంస్థలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో వ్యక్తుల సంచారం అధికంగా ఉంటుందని తెలిపారు. వారిలో ఎవరు ఎలాంటి వారో చెప్పడం కష్టమని, అప్రమత్తంగా ఉండటమే మేలని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మధు పాల్గొన్నారు.

పాఠశాలలో లైబ్రరీ ప్రారంభం


లైబ్రరీని ప్రారంభించిన క్లబ్ గవర్నర్ తదితరులు

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సహకారంతో యాదగిరిగుట్ట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌ను బుధవారం క్లబ్ జిల్లా గవర్నర్ మహేందర్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. క్లబ్ సభ్యుడు భిక్షపతి రూ.1.50 లక్షలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్మన్లు జనార్దన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, జోన్ చైర్మన్ లింగయ్య, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి ప్రతాప్‌రెడ్డి, క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంటినల్ అధ్యక్షుడు రాము, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, రామకృష్ణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ


తహసీల్దార్‌ను కలిసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు

కడ్తాల్: అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారుల ఉత్వర్వుల జారీ మేరకు మండలంలో శిక్షణ(అప్రెంటిషిప్) కోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లు 15 మందిని నియమించారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దార్ ముంతాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారుల ఆదేశాల మేరకు 40 రోజుల శిక్షణకు సర్వేయర్లు వచ్చారని పేర్కొన్నారు.

కళాకారులకు సత్కారం


కళాకారులను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ సమీపంలోని సేవాలాల్ గుట్ట వద్ద బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు జీవం పోస్తు బంజారా పాట చిత్రీకరణకు వచ్చిన గిరిజన కళాకారులు బుచ్చునాయక్, సుజాతలను బుధవారం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ సన్మానించారు. కార్యక్రమంలో కల్కి భగవాన్, ఉదయ్ కిరణ్, సురేశ్‌నాయక్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మురుగునీరు, చెత్తాచెదారంతో నిండిపోయిన వరద కాల్వలు



మురికి కూపం.. వరదకాల్వ

- వ్యర్థాలు కలిసి.. డ్రైనేజీగా మారి
- తీవ్రమైన దుర్వాసన, దోమల విహారం
- ఆందోళనలో అనాజ్‌పూర్ గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి అనాజ్‌పూర్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. పట్టించుకునే వారు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇందిరమ్మ సాగర్ చెరువు నిండి.. వీధులు, ఇళ్ల మధ్య గుండా దిగువ ప్రాంత గ్రామాల చెరువులకు వరద పారే కాల్వ ప్రస్తుతం మురికి కూపాన్ని తలపిస్తోంది. చెత్తాచెదారం, మురుగు జలాలు కలిసి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లల్లో ఉండలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. దోమలు, ఈగలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలమని, అనారోగ్యం పాలు కావాస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వరదనీటి కాల్వలోకి కలుస్తున్న మురుగును దారి మళ్లించి, దానికి పైకప్పు వేయాలని పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై బీజేపీ పోరుబాట

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: ప్రజా సమస్యలపై, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ శ్రేణులు ఉద్యమించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆమనగల్లు పట్టణంలో ఈ నెల 11న ధర్నా చేయనున్నామని తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ బూత్‌కమిటీ అధ్యక్షుడు, శక్తికేంద్రం ఇన్‌చార్జీలు, సహ ఇన్‌చార్జీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత వైఖరిపై బీజేపీ పోరుబాట పట్టనుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు నర్సింహ, చెన్నకేశవులు, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదవులు కాదు.. బలోపేతమే లక్ష్యం

కార్యకర్తల సమావేశంలో బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: పార్టీలో పదవులు ముఖ్యం కాదు. బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ కౌన్సిలర్లు భాస్కర్, సత్యనారాయణలు అన్నారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రజా సమస్యలపై ఉద్యమించాలన్నారు. అప్పుడే పార్టీ ప్రజలకు మరింత చేరువ అవుతుందని పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీలు

బీజేపీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్, పి.మహేందర్, ఉపాధ్యక్షులు సంతోష్‌కుమార్, సురేష్, మైలారం శివ, నరేష్, కార్యదర్శులుగా చంద్రశేఖర్‌రెడ్డి, అభిషేక్, యువమోర్చా అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి, కిషాన్‌మోర్చా అధ్యక్షుడిగా గోవర్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా రజిత, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా సాయిరామ్‌లను నియమించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, రాఘవేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.


నూతన కమిటీతో పార్టీ నేతలు

దేశభక్తిని పెంపొందిస్తున్న ఏబీవీపీ


నూతన కమిటీతో సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించడమే కాకుండా.. విద్యార్థుల్లో దేశభక్తి భావాలను ఏబీవీపీ పెంపొందిస్తుందని ఆ సంఘం హైదరాబద్ మహానగర ప్రముఖ డా.రామకృష్ణ అన్నారు. స్థానికంగా బుధవారం నిర్వహించిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పునర్నిర్మాణమే లక్ష్యంగా జ్ఞానం, శీలం, ఏకత సిద్ధాంతాలతో జాతీయ భావాలను విద్యార్థుల్లో నింపుతున్న ఏకైక సంఘం ఏబీవీపీ అన్నారు. 1949 జూలై 9న ఆవిర్భవించిన సంఘం .. దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం పట్నం మున్సిపల్ ప్రధాన కార్యదర్శిగా మహేందర్, ఉపాధ్యక్షుడిగా నవదీప్, నగర జాయింట్ సెక్రటరీలుగా ఆదర్శ్, కార్తీక్, అజయ్‌లను నియమించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లికార్జున, శివకృష్ణ, పవన్, యశ్వంత్, శివ, ఆదర్శ్, పవన్, రాహుల్, సదీప్, చరణ్‌లు పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: ఈ నెల 11 నుంచి జరిగే రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడ పరిధిలోని ఎల్లమ్మ ఆలయాన్ని ఆమె సందర్శించి, ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ ఆలయానికి భూమి ఎక్కువగా లేకపోవడంతో మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామన్నారు. ఆలయ పక్కన ఉన్న రైతుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే ఆలయానికి సీసీరోడ్డు మంజూరు చేశామన్నారు. ఉత్సవాల ముగింపు అనంతరం రోడ్డు పనులు ప్రారంభించి, పూర్తి చేయాలన్నారు. ఈ ఉత్సవాలకు వేలాది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందునా ఏర్పాట్లు చేయాలన్నారు. రావిర్యాల చెరువు కట్టపై జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ చెరువు అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశామని స్పష్టం చేశారు. పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఒక విజన్‌తో పని చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్లు రవినాయక్, సుమన్, లావణ్య, నాయకులు వెంకటరాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రావిర్యాల చెరువు కట్ట వద్ద అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మహేశ్వరం: మండల కేంద్రంలో సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభల వాల్‌పోస్టర్‌ను సీపీఐ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఆగస్టు 19 నుంచి 22 వరకు మేడ్చెల్ జిల్లా మల్కాజిగిరిలో జరిగే మహాసభలకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లాటి యాదయ్య, మండల కార్యదర్శి దేవేందర్‌గౌడ్ ఉన్నారు.

ఢిల్లీలో బీసీల ధర్నా..

పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి


ధర్నాలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు: బీసీ రిజర్వేషన్ల ఆమోదానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం నిర్వహించిన మహాధర్నాలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు.. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, శెట్టిపల్లి మాజీ సర్పంచ్ సత్యం, కాంగ్రెస్ నాయకులు దశరథం, రమేష్ గౌడ్, రాములు, బాలరాజు, అజీం ఉన్నారు.

గ్రామకంఠం స్థలం కాపాడండి

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామకంఠం స్థలాన్ని కాపాడాలని చింతపల్లిగూడ పట్టణ ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. స్థలాన్ని కబ్జా చేసి లెట్రిన్ గుంతలు తవ్వుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఉన్న బోరింగ్, బొడ్రాయి, జమ్మిచెట్టు జెండా దిమ్మెను తొలగించారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి, స్థలాన్ని సంరక్షించాలని కోరారు. శేఖర్, రమేష్, అశోక్, సంజీవ, గణేశ్, శ్రీకాంత్, శివకుమార్, అర్జున్, టిల్లు పాల్గొన్నారు.

నూతన నియామకం

ఇబ్రహీంపట్నం: బీజేపీ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శిగా పి.మహేందర్‌ను నియమిస్తూ ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పి.మహేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. పార్టీ పటిష్టతకు కృషిచేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. పదవి వచ్చేందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.


మహేందర్, బీజేపీ ప్రధాన కార్యదర్శి

గద్దర్ సేవలు చిరస్మరణీయం

- అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహనీయుడు
- వర్ధంతిలో వక్తలు

ఆమనగల్లు/ కడ్తాల్: అణగారిన వర్గాల అభ్యున్నతికి తన ఆట పాటలతో ప్రజల్లో చైతన్యం తెచ్చిన మహనీయుడు ప్రజా యుద్ధనౌక గద్దర్ అని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గద్దర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. గద్దర్ రచనలు, ఆయన గాత్రం, ప్రజలకు ఇచ్చిన ధైర్యం, హక్కుల కోసం పోరాటానికి దారి చూపాయని తెలిపారు. ఆయన చూపిన మార్గం సకల జనులకు ప్రేరణ కలిగించిందన్నారు. జహంగీర్‌అలీ, జంగయ్య, పాషా, కృష్ణయ్య, మహేందర్, శంకర్, మల్లయ్య, రమేశ్, ప్రవీణ్‌గౌడ్, సందీప్, శ్రీను, మహేశ్, మణి, నరేశ్ ఉన్నారు.


కడ్తాల్: గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లులో..

ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమనగల్లు పట్టణంలో కల్వకుర్తి గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులు అర్పించారు. కమిటీ అధ్యక్షుడు లక్ష్మణశర్మ, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, ప్రజాసంఘాల నాయకులు గోపాల్, భిక్షపతి, బొజ్జన్న, సుధాకర్, రజిత ఉన్నారు.


ఆమనగల్లులో.. గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గిరిజన విద్యార్థులకు శిక్షణ శిబిరం


శిబిరం ప్రారంభిస్తున్న ఏసీఎంఓ అశోక్

కడ్తాల: గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో వాయిస్–4 సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ శిబిరాన్ని గిరిజన సంక్షేమ జిల్లా అధికారి రామేశ్వరిదేవి, ఏటీడీఓ వెంకటయ్య ఆదేశాల మేరకు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అశోక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు శారీరక, మానసిక, సామాజిక అవగాహనను పెంపొందించడంతో పాటు, సమాజంలో సమానత్వ దృక్పథం 'హర్ వాయిస్ ఫర్ బాయ్స్' పేరిట వాయిస్– 4 సంస్థ ఆధ్వర్యంలో 10 రోజులు ఐటీడీఏ సహకారంతో శిబిరం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీమ్లానాయక్, వసతిగృహ సంక్షేమాధికారి రాములు, ఉపాధ్యాయులు దేవానంద్, మంజుల, ఆర్.మంజుల, సాయిలు, వాయిస్ కోఆర్డినేటర్స్ శ్రీకృష్ణ, అభిలాష్, మనోహర్, అమ్రిత పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే పల్లెల అభివృద్ధి

ఇంటింటి ప్రచారంలో బీజేపీ శ్రేణులు

యాచారం: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని బీజేపీ నాయకులు అన్నారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నస్దిక్‌సింగారం గ్రామంలో పార్టీ నాయకుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ.. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, యాదగిరిరెడ్డి, యాదయ్య, విజయనాయక్, రవీందర్, మధుకర్‌రెడ్డి, విజయకుమార్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్రం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు లచ్చిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరు వెంకటరెడ్డి, జిల్లా నాయకులు భాషయ్య, శ్రీశైలం, మండల మాజీ అధ్యక్షుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కమలనాథులు

సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఛలో కమిషనరేట్ ముట్టడి కార్యక్రమానికి సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధి నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రూ.10 వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు గుర్తింపు కార్డులు అందించి, క్రమబద్ధీకరించాలన్నారు. ఏడాదికి నాలుగు జతల బట్టలు ఇవ్వాలని, ధరలకు అనుగుణంగా కూరగాయలు, కోడిగుడ్ల ధరలు పెంచాలన్నారు.

తెలంగాణ మార్గదర్శి జయశంకర్

- సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి
- ఆచార్య జయంతిలో వక్తలు

కడ్తాల్: 'తెలంగాణ కోసం జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్. నిరంతరం స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా పోరాడిన మహోన్నతవ్యక్తి' అని పలువురు వక్తలు అన్నారు. ఆచార్య జయంతి సందర్భంగా బుధవారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ ఎందుకు కావాలి? అన్న ప్రశ్నకు కోట్లాది మందికి అర్థమయ్యేలా వివరించిన మహామనిషని కొనియాడారు. అధ్యాపకుడిగా, ఉద్యమకారుడిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీమన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు.

యాచారంలో..

యాచారం: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ రాధారాణి, మండల పంచాయతీ అధికారి శ్రీలత, పర్యవేక్షణ అధికారి శైలజ తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు. ఆచార్య వలనే ప్రత్యేక రాష్ట్రం కల నెరవేరిందని తెలిపారు.


యాచారం: సార్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీడీఓ రాధారాణి తదితరులు


కడ్తాల్: జయశంకర్ జయంతి వేడుకల్లో నాయకులు

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

ఇబ్రహీంపట్నం: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. సార్ జయంతిని పురస్కరించుకొని బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్మారక సదస్సును ప్రిన్సిపాల్ రాధిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1952లో ముల్కీ, నాన్ ముల్కీ ఉద్యమం నుంచి 1969 తెలంగాణ తొలి దశ, 2001 మలి దశ పోరును ముందుకు తీసుకెళ్లడానికి ఆచార్య స్థాపించిన తెలంగాణ విద్యావంతుల వేదిక, ఆమెరికాలో ఫోరం ఫర్ డెవలప్‌మెంట్, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీలు స్వరాష్ట్ర సమస్య పరిష్కారానికి కీలక భూమిక పోషించాయని తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక జయశంకర్ అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్, సమన్వయకర్త డీఎస్ఎస్ఆర్ కృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ డా.నరేందర్‌రెడ్డి, అధ్యాపకులు రమేష్, రాకేష్ భవాని, రవి కుమార్, పవన్‌కుమార్, నర్సింగ్‌రావు, సురేఖ, కరుణ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న నాగయ్య